విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 19, మే 2023

నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం 26న బహిరంగ సభ

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన డోన్ పట్టణంలో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం 20 డిమాండ్స్ తో బేతంచెర్ల మండలంలో పల్లె పల్లెన విస్తృత ప్రచార నిర్వహించి అభివృద్ధి అంటే రోడ్లు పూర్తి చేయడం కొన్ని పనులు చేయడం కాదు,శాశ్వత పరిష్కారం మైన హంద్రీ నీవా కాలువ ద్వారా చెరువులో నింపడం రైతులను ఆదుకోవడం,గిట్టుబాటు ధర కల్పించడం,మండలంలో అపారమైన ఖనిజ సంపద ఉంది ఆ సంపదకు తగ్గట్టు పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి పరిష్కారం చూపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా గొప్ప అవకాశం వచ్చినప్పటికీ శాశ్వతమైన పనులు చేయడంలో మంత్రి అలసత్వం ఉందని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని వారు ప్రజానీకానికి సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, మండల కార్యదర్శి వై. భార్గవ్ పిలుపునిచ్చారు. మహిళలకు వంట గ్యాస్ సిలిండర్ రూ.500 రూపాయలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 8 సార్లు విద్యుత్ ఛార్జీలు,12 సార్లు బస్సు చార్జీలు పెంచి ప్రజల పైన పన్నుల భారం మోపి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం అమ్మఒడి నవరత్నాల్లో భాగంగా ప్రజలకు డబ్బులు పంపిణీ చేస్తూ, గొప్పలు చెప్పుకుంటున్నాడు.దీని వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. జీపు జాతలో భాగంగా రెండో రోజు పెండేకల్లు,వెంకటగిరి,మర్రికుంట,ముసలాయి

చెరువు,ముద్దవరం,పెద్ద కొమ్ములపల్లి మీదుగా బేతంచర్ల పట్టణానికి చేరుకుంది. ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి సుంకయ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ,గిరిజన సమ్మె జిల్లా కార్యదర్శి మోటా రాముడు,రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఓబులాపురం నారాయణ ,ప్రజానాట్య మండల అధ్యక్ష కార్యదర్శులు శివయ్య,వాసు, ఏఐటీయుసి నియోజకవర్గ కార్య దర్శి అబ్బాస్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు సిద్ధు,మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మి దేవమ్మ, హసినమ్మ, రాజశ్రీ,మండల సహాయ కార్యదర్శులు దస్తగిరి, తిరుమలేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్,ఏఐవైఎఫ్ నాయకులు భాస్కర్,ఎల్లకృష్ణ,దిలీప్,కిరణ్,కార్తీక్, మధు,శ్రీకర్, పాల్గొన్నారు.

స్థలాలలిచ్చి, ఇళ్లను నిర్మించాలి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణంలో అధికారులు సూచించిన జగనన్న కాలనీలలో అధికార పార్టీ నాయకుల అనుచరులకు కాకుండా నిజమైన నిరుపేదలను వాలంటీర్ల ద్వారా వెరిఫై చేసి ఇళ్లను ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, సీపీఐ నాయకులు హబీబ్ బేగ్, సాంబశివుడులు తెలిపారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ పార్టీ ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇల్లు నిర్మించాలని చెప్పి 32వేల ఎకరాలను సూచించింది. కానీ నంద్యాల పట్టణంలో ఇంతవరకు జగనన్న కాలనీలో పేదలకు ఇంటి స్థలం చూపలేదన్నారు. ఈ మధ్యనే ఎమ్మెల్యే

కోర్టులో స్థల సమస్య పరిష్కారమైనదని, జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మిస్తామని చెప్పడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వము జగనన్న గృహానికి 1,80,000 రూపాయలు ఇస్తామన్నారు. కానీ ఇప్పుడు మీ ప్రభుత్వం వచ్చినాక ఇసుక, సిమెంటు, స్టీల్, కంకర ఇలా అనేక ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం జరిగిందని, కనుక మీరు ఇచ్చే 1,80,000 రూపాయలు ఒక గృహానికి ఏ మాత్రం సరిపోదని, వాటిని ఐదు లక్షల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం గ్రామంలో రూ.5 లక్షలు వ్యయం చేసి పైప్ లైన్ నూతనంగా నిర్మించడంతో 10 సంవత్సరాల మంచినీటి సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలోని గౌరమ్మ చావిడి వీధిలో పది సంవత్సరాల క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఈ పైప్ లైన్ పక్కనే త్రాగునీటి కులాయి పైపు ఉండడంతో గ్రామంలోకి నీరు వదిలినప్పుడల్లా ముందుగా ఐదు నిమిషాల పాటు డ్రైనేజీలోని మురికి నీరు కలిసి వచ్చేదని పంచాయతీ కార్యదర్శి బండి రాజశేఖర్ తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ నడిపెన్న ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.5 లక్షలతో నూతన పైప్ లైన్ పనులు పూర్తి చేశారు. దీంతో గురువారం ఆర్డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఏఈ ఫణీత్ కృష్ణ గ్రామంలోని పైప్లైన్ పనులను పరిశీలించి కుళాయిల ద్వారా వచ్చే నీటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేఖ పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

విశాలాంధ్ర - మిడుతూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలకు చేరువ అయ్యే విధంగా వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని ఎంపీడీవో జి .నాగ శేషాచల రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 19విజయవాడలో వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఉత్తమ వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 2023 సంవత్సరంనకు సంబంధించి మిడుతూరు మండలంలోని వాలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో భాగంగా మొత్తం 182 మంది వాలంటీర్లకు ప్రభుత్వము నుండి సన్మాన కార్యక్రమము శుక్రవారం నుండి నెల రోజుల పాటు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆర్థర్ హాజరవుతారని అంతేగాక ఆయన చేతుల మీదుగా రెండు వజ్ర అవార్డులు పొందిన వీపనగండ్ల గ్రామానికి చెందిన బరిగేలా అనూష ,మిడుతూరు రెండవ సచివాలయ పరిధిలో గల సయ్యద్ అజ్మద్దీన్ వీరికి 30,000/-రూపాయలు బహుమానం అందజేయనున్నారు. అంతేకాక ఐదు సేవ రత్న అవార్డులు పొందిన వారు కడుమూరు కోడి కాళ్ళ రమాదేవి,మిడుతూరు 1- కే సామక్క నాగలూటి - సోలిపురం వరలక్ష్మి తలముడిపి - ఎస్.ఈశ్వరమ్మ,తిమ్మాపురం -పిక్కిలి విజయుడు వీరికి 20,000/- రూపాయలు బహుమానం ఇవ్వడం జరుగుతుందన్నారు. సేవా మిత్రా అవార్డులు.175 గ్రామాల వారీగా అలగనూరు 12,చెరుకుచెర్ల 9 చింతలపల్లి 9 చౌట్కూర్ 16,దేవనూర్ 10, జలకనూర్ 14,కడుమూరు 16 ,మాసాపేట11,మిడుతూరు1-17,మిడుతూరు2-17,నాగలూటి11,తలముడిపి 16,తిమ్మాపురం7,వీపనగండ్ల 10వీరికి10,000/- రూపాయలు బహుమానంతో పాటు వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వజ్రా ,సేవారత్న,సేవామిత్రఅవార్డులుపొందినవాలంటీర్లనుఎంపీడీవోఅభినందించారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - పాణ్యం : జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్, పాణ్యం శాఖ గ్రంధాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. గ్రంధాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపు వివరాలను, క్యాంపులో పాల్గొన్న విద్యార్థులను ప్రశ్నించడం జరిగింది. విద్యార్థులతో కోలాటంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల పట్ల చైర్మన్ సంతృప్తి కనవరిచారు. ఈ సమ్మర్ క్యాంపులో కేశవరెడ్డి స్కూల్ ఇంగ్లీష్ మాస్టర్ అరిసెన్ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ టిప్స్ ఎక్స్ప్లయిన్ చేశారు. ఈ కార్యక్రమం నందు గ్రంధాలయం అధికారిని భాగ్యలక్ష్మి, పాఠకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

విశాలాంధ్ర - పగిడ్యాల : మండల కేంద్రమైన పగిడ్యాల ఔట్ పోస్ట్ సమీపంలో ట్రాక్టర్ పై పశుగ్రాసం తరలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైనట్లు రైతు మల్లయ్య బుధవారం తెలిపారు. ఆంజనేయ నగర్ సమీపంలోని తన రెండు ఎకరాల పొలం నుండి పశుగ్రాసం తరలిస్తుండగా అవుట్ పోస్ట్ వద్ద విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగడంతో వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పశుగ్రాసము అన్లోడ్ చేసే లోపల పూర్తిగా దగ్ధమైంది, 20 వేల రూపాయల పశు గ్రాసము దగ్ధమైనట్లు రైతు మల్లయ్య తెలిపారు.

క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వద్దు

విశాలాంధ్ర - అవుకు : క్షయ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాకపోయినప్పటికీ నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని తగు జాగ్రత్తలు డాక్టర్ సలహాలు సూచనలు తీసుకుని క్షయ వ్యాధిని జయించాలి అని ఉప్పలపాడు పీహెచ్సీ ప్రాథమిక వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ యమునా లు అన్నారు. గురువారం పీహెచ్సీ పరిధిలోని 25మంది వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించారు. ముఖ్యఅతిథిగా తహసిల్దార్ శ్రీనివాసులు హాజరయ్యారు. వైద్యులు మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదని సూచనలు సలహాలు పాటిస్తూ వైద్యం చేయించుకుంటే క్షయ వ్యాధిని జయించవచ్చని అన్నారు. 25మందిని దత్తత తీసుకుని వారిలో పోషకాహారాన్ని పెంచటానికి ఒక్కొక్కరికి ఒక నెలకు సరిపడా కంది పప్పు, గోధుమపిండి, రాగి పిండి,వంటనూనె, బెల్లం, కోడిగుడ్లుతో కూడిన700 విలువ కలిగిన పోషకాహార కిట్ ను అందించామని అన్నారు.పబ్లిక్ హెల్త్ నర్స్ మల్లేశ్వరి, సూపర్వైజర్లు కమల్ సాహెబ్, వేణు గోపాల్‌రాజు, తెరిసమ్మ, టిబి సూపర్వైజర్ నరసింహా, ఏఎన్ఎంలు జ్యోతి, దానమ్మ, వెంకటేశ్వరమ్మ, ఎల్లమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆయాలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాలో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని, వడగాల్పులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 41 నుంచి 44డిగ్రీల వరకు ఎండలు భగ్గుమనడంతోపాటు వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారని, ఈ మేరకు భారత మెట్రోలాజికల్ విభాగం(ఐఎండీ), వాతావరణ శాఖ కూడా హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలతో ఎండలు ఎక్కువ అవ్వడం వల్ల వడగాడ్పుల ముప్పు పొంచి ఉందన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. రోహిణి కార్తె సమీపించినందున ఎండలు పెరుగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలని, వేడివల్ల డీహైడ్రేషన్ బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. నీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీరు లాంటివి ఎక్కువగా తీసుకోవాలని, వేడి నుంచి కొంత ఉపశమనం కోసం లేత రంగులో ఉండే వదులైన దుస్తులు ధరించాలన్నారు. ఎండవేళ వీలైనంత వరకూ బయటకు వెళ్లకపోవడం ఉత్తమమని, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తల, మొహంపై నేరుగా సూర్య కిరణాలు పడకుండా టోపీ లేదా తలపాగా ధరించాలని, లేదంటే గొడుగు వాడాలన్నారు. శరీరంలో నీరు, లవణాలు చెమట వేడివల్ల ఎక్కువగా బయటకు వెళ్లే అవకాశం ఉన్నందున ఉప్పు కలిపిన మజ్జిగ ఎక్కువసార్లు తీసుకోవడం మంచిదని, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు గది వాతావరణం కొంత చల్లగా ఉండేలా కిటికీలకు వట్టివేళ్ల లాంటివి కట్టి, నీరు చల్లడం లాంటి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.ప్రయాణాలలో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, ఏదైనా అత్యవసరమైతే సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాలని...వైద్యులను సంప్రదించి సూచనలు సలహాలు పాటించాలన్నారు.

బహిరంగ సభ ప్రాంగణం పరిశీలన

విశాలాంధ్ర - బనగానపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా బనగానపల్లె పట్టణంలో జరిగే బహిరంగ మీటింగ్ సభా ప్రాంగణాన్ని పరిశీలించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, యువగళం కోఆర్డినేటర్లు శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

యువ గళం పాదయాత్రలో బీసీ

విశాలాంధ్ర - బనగానపల్లి : నంద్యాల నియోజకవర్గంలోనీ యాతం జయచంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ శివారు విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో యువ నాయకుడు నారా లోకేష్‌కి సంఘీభావం తెలుపుతూ అడుగులో అడుగు వేస్తున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి.

ఎన్ఆర్ఐ టీడీపీ సహకారంతో అమెరికాలో ఉద్యోగాలు

విశాలాంధ్ర - నంద్యాల : తెలుగుదేశం పార్టీకి చెందిన అనుబంధ విభాగం అయిన ఎన్ఆర్ఐ టిడిపి ఆధ్వర్యంలోని టిడిపి ఎంపవర్మెంట్ సెంటర్ వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి అమెరికా దేశంలో ఉద్యోగాలు కల్పించే ప్రోగ్రాంను చేపట్టి విజయవంతంగా అమలు చేస్తోంది. అందులో భాగంగా ఇరువురు హోటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు అమెరికాలోని టెక్సాస్ మరియు పెన్సిల్వేనియా రాష్ట్రాలలో (ఇంటర్నషిప్ ప్రోగ్రాం) ఉద్యోగాలు పొందారు. ఈ ఇరువురు విద్యార్థులు తలారి సురేంద్ర కుమార్ (కర్నూలు జిల్లా) షేక్ ఇంతియాజ్ మహ్మద్ (అనంతపురం జిల్లా) పాదయాత్ర చేస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను గురువారం కర్నూలు జిల్లాలోని నంద్యాల క్యాంపు సైట్ వద్ద కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి జాబ్ ఆఫర్ లెటర్స్ అందచేసిన లోకేష్ వారిని అభినందించారు. ఎన్ఆర్ఐ టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంపవర్మెంట్ సెంటర్ రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వేదికగా మారిందని చెప్పారు. వీరితో పాటు అక్కౌంట్స్ ట్యాలీలో శిక్షణ అనంతరం హైదరాబాద్ లోని ప్రైవేటు సంస్థలో ఉద్యోగం పొందిన మునిచంద్రను కూడా అభినందించారు. గల్ఫ్ లో ఉపాధి పొందే నిమిత్తం నంద్యాలకు చెందిన మరి కొందరు విద్యార్థులు కూడా విజయవంతంగా శిక్షణ పొందారు.. టిడిపి ఎంపవర్మెంట్ సెంటర్ లో వారి శిక్షణ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ను అమలు చేస్తామని విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. టిడిపి ఎంపవర్మెంట్ సెంటర్ ఛీఫ్ మెంటర్ వేమూరు రవికుమార్ , యుఎస్ కోఆర్డినేటర్ మల్లిక్ , ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ గరిమెళ్ళ రాజశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - నంద్యాల : రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ ను కఠినంగా శిక్షించాలని ఏఐటీయుసి ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాని మోడీని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ, సిపిఐ, ఏఐటీయుసి నంద్యాల పట్టణ కార్యదర్శులు ప్రసాద్, డి. శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడులు ప్రధానిని డిమాండ్ చేసారు. మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడా వేదికలైన ఒలంపిక్స్, కామన్వెల్త్, ఏసియన్ గేమ్స్ తదితర పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పథకాలను సాధించి భారత దేశానికి కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన మహిళ మల్ల యోధులు (రెజ్లర్స్) వారు అంతర్జాతీయ వినువీధులలో దేశ పతాకాన్ని రెపరెపలాడించిన అగ్రశ్రేణి క్రీడాకారులు మన ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా పెంచినవారు నేడు న్యాయం కోసం ఢిల్లీలో నడివీధుల్లో జంతర్ మంతర్ వద్ద న్యాయ పోరాటం చేస్తున్న నేపథ్యంలో ఈ బీజేపీ ప్రభుత్వం తమ బిజెపి ఎంపీ, డబ్ల్యూఎస్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పైన ఎటువంటి చర్యలు తీసుకోకుండా అతని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రెజ్లర్లకు మద్దతుగా జాతీయ వ్యాప్తంగా ఏఐటీయుసి ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించి వారికి న్యాయం జరిగేంతవరకు పోరాడుతుందన్నారు. సీపీఐ నంద్యాల పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, పిఐటి లు నరసింహ, జనార్దన్, రవి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు, దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల : అసత్యపు ఆరోపణలు, దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని నారా లోకేష్ కు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి హితవు పలికారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా తనపై చేసిన ఆరోపణలను లోకేష్ నంద్యాల నుండి వెళ్లే లోపు నిరూపించాలని ఛాలెంజ్ చేశారు. సంస్కారం, సభ్యత మరిచి మాట్లాడడం లోకేష్ కు, టిడిపి నాయకులకు తగదని వ్యవహార శైలిని మార్చుకోవాలని, దిగజారుడు రాజకీయాలకు స్వస్తి పలకాలని ఎమ్మెల్యే హితవు పలికారు. నంద్యాలలో నిర్వహించిన సభలో లోకేష్ ప్రజల సమస్యల గురించి, రాయలసీమ ప్రాంత అభివృద్ధి గురించి, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి గురించి ప్రస్తావిస్తాడని ప్రజలు ఆశించారని, అయితే అతను కేవలం అధికార పార్టీ పైన వైఎస్ఆర్సిపి నాయకుల పైన దృష్టి కేంద్రీకరించి అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే కార్యక్రమాన్ని పెట్టుకున్నారన్నారు. ఆర్టీవో ఏజెంట్ కరీం కుటుంబానికి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అండగా నిలిచి, ఆర్థిక సాయంగా తొమ్మిది లక్షలు అందించామన్నారు. లోకేష్ ఏ స్క్రిప్ట్ ఇస్తే అది చదవడం అలవాటైందని అందులో నిజాలు తెలుసుకోవాలన్నారు. టిడిపి నాయకులు నంద్యాలలో కబ్జాలు చేస్తే ఆ పాపం వైసిపి నాయకులపై

ఆపాదించడం సమంజసం కాదన్నారు. బోగ్గులైన్ రహదారి వెడల్పులో తమ స్వలాభం ఎక్కడుందో లోకేష్ చూపాలన్నారు. నంద్యాలలో మూడు రోజులు లోకేష్ ఎంటర్ టైన్మెంట్ జబర్దస్త్ కామెడీ అందిస్తున్నారని పేర్కొన్నారు. ముందు మీ టిడిపిలో జరుగుతున్న పరిస్థితులను చక్కబెట్టుకోవాలని, ఎదుటివారిపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్సీ ఇస్సాక్ భాషా, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షా వలి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల కార్మికులకు భరోసా

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : వైయస్సార్ పార్టీ కార్యాలయము నందు మున్సిపల్ కౌన్సిలర్ కలిముల్లా ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఇటుక బట్టీల కార్మికులు శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలు తెలియజేయడం జరిగింది. తక్షణమే ఎమ్మెల్యే మీ సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని కార్మికుల అందరికీ భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి,ఆత్మకూర్ టౌన్ పార్టీ ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా పెద్ద కంబలూరు రోడ్డు పనులు

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధి లోని పెద్దకంబలూరు గ్రామం నుండి మెట్ట వరకు నూతన రోడ్డు పనులను అధికారులు శరవేగంగా చేపట్టారు. గురువారం గ్రామ శాఖ కార్యదర్శి రామాచారి అధ్యక్షతన మండల కార్యదర్శి బాల నరసింహుడు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ లు రోడ్డు పనులను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. పలువురు సీపీఐ నాయకులు మాట్లాడుతూ నూతన రోడ్డు ఏర్పాటుకు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వలన ఇంతవరకు గ్రామానికి రోడ్డు వేయకపోవడంతో కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. కోర్టు సంబంధిత అధికారులకు నోటీసులు పంపడంతో అధికారులు గ్రామానికి నూతన రోడ్డు పను లను చేపట్టడం జరిగిందన్నారు.వచ్చేనెల మూడవ తేదీన కోర్టు వారు వాయిదా వేయడం జరిగిందని, వాయిదా నాటికల్లా గ్రామానికి నూతన రోడ్డు పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలపడంతో సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వీరి వెంట నాయకులు నాగనరసింహుడు, నారాయణ, వెంకటేశ్వర్లు,సుబ్బరాయుడు, పుల్లయ్య,ఆంజనేయులు,లింగమయ్య,రామచంద్రుడు, పౌల్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగస్తుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని జేపీసీ ఉద్యోగులు ఎమ్మెల్యే గంగులకు వినతిపత్రం అందించారు. ఏపీ జేఏసీ అమరావతి మూడవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగుల ఆవేదనను చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల నానిని గురువారం ఏపీ జెఏసి నంద్యాల జిల్లా నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రతి నెల1న ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏ అరియర్స్, పిఆర్సి అరియర్స్, 11వ పిఆర్సి కమిషన్ రెకమండు చేసిన పే స్కేల్ విడుదల, పెండింగ్ లో ఉన్న రెండు డీఏల చెల్లింపు, పాదయాత్రలో ముఖ్యమంత్రి ప్రకటించిన సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ గురించి తదితర ప్రధాన సమస్యలను గురించి జేపీసీ నంద్యాల జిల్లా నాయకులు శాసనసభ్యులు గంగుల నానికి వివరించారు. వారి సమస్యలు విన్న శాసనసభ్యులు గంగుల సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఏపీ జెఎస్ నాయకులు తెలిపారు. నంద్యాల జిల్లా చైర్మన్ రామచంద్రరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు కామేశ్వర్ రెడ్డి, కోశాధికారి నాగరాజు, నంద్యాల డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు విజయ శేఖర్, ఆళ్లగడ్డ డిడి లు రవీంద్రప్రసాద్, చంద్రశేఖరయ్య లు పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని రాజరాజేశ్వరి ఐటిఐ కళాశాల నందు ప్రవేశానికి దరఖాస్తులు ప్రారంభమైనట్లు కరస్పాండెంట్ దుపాటి దామోదర్ చౌదరి తెలిపారు.మాట్లాడుతూ 2023-2024 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రీషన్ డ్రాఫ్టె మెన్ సివిల్, డిజల్ మెకానిక్, ట్రేడ్స్ కలవన్నారు. ఏదైనా మరింత సమాచారం కొరకు8886997744,5152586064 సంప్రదించాలన్నారు.

తప్పుడు కేసులు అధికార పార్టీ కుట్రే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మాజీ మంత్రి, తన సోదరి భూమా అఖిలప్రియ పై తప్పుడు కేసులు పెట్టడంలో అధికార వైసిపి పార్టీ కుట్ర ఉందని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో గురువారం విలేకరు లతో మాట్లాడుతూ గత 40 రోజులుగా పాదయాత్రలో భూమా అఖిల ప్రియ చంటి బిడ్డను వదిలి లోకేష్ వెంట నడుస్తున్నారని ఇన్ని రోజులుగా జరగని గొడవ ఆళ్లగడ్డ పర్యటన మరో మూడు రోజులు సమయం ఉండగా ఈ సంఘటన జరగడం అనుమానాలకు తావిస్తుందన్నారు. అక్క అఖిలప్రియను డ్యామేజ్ చేయాలన్న దురుద్దేశంతో పక్కా ప్రణాళికతో వ్యూహం పన్నీ గొడవలు సృష్టించారన్నారు. తన అక్క పై తప్పుడు కేసులు నమోదు చేసి చంటిపిల్ల తల్లి అని కూడా చూడకుండా జైలుకు పంపించారన్నారు. ఏవి సుబ్బారెడ్డి అనే వ్యక్తి అక్క చున్ని పట్టుకొని అవమానకరంగా ప్రవర్తించారన్నారు. అక్కను అవమాన పరిచినందుకే కార్యకర్తలు దాడికి దిగారన్నారు. కూతురు లాంటి అఖిలప్రియ పట్ల ఏవి సుబ్బారెడ్డి చేసిన చేష్టలకు సరైన సమాధానం చెబుతామన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆళ్లగడ్డలో పాదయాత్రను విజయ వంతం చేస్తామన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీ వెంటే నడుస్తామ న్నారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అక్క అఖిల ప్రియ ఏవి సుబ్బారెడ్డి పై కేసు పెట్టడం జరిగిందని, ఆ కేసు ఏమైందని ప్రశ్నించారు. నంద్యాల ఘటనలో బాధితులమైన తమపైనే కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం చాలా అన్యాయమన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ఆళ్లగడ్డలో పాదయాత్రను విజయవంతం చేస్తామన్నారు.. ఈ పాదయాత్రతో భూమా అఖిలప్రియ బలం ఏమిటో రాష్ట్రం అంతటా తెలుస్తుందన్నారు.. నంద్యాల ఘటనపై విచారణ చేయనున్న టిడిపి క్రమశిక్షణ కమిటీ బాధితురాలైన తన అక్కకు న్యాయం చేస్తుందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈనెల 21నుండి పాదయాత్ర మొదలవుతుందన్నారు. ఈ యాత్రను టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పల్లెప్రగతిలో నా కృషికి ఆనవాళ్లు

విశాలాంధ్ర - నంద్యాల : కానాల గ్రామంలో యువగళం పాదయాత్ర చేస్తుండగా, ఆశ్చర్యకరంగా నేను పంచాయతీరాజ్‌శాఖా మంత్రిగా వేసిన శిలాఫలకాలు కనిపించాయని,మరింత ఆసక్తి పెరిగి, ఈ పనులన్నీ పూర్తయ్యాయో లేదోనని చూశానని, ప్రతీ అభివృద్ధి పనీ పూర్తయ్యిందని, శంకుస్థాపన చేసిన మేమే ప్రారంభోత్సవం కూడా చేశామని, ఇది నా విశ్వసనీయత, తెలుగుదేశం కమిట్మెంట్ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన పాదయాత్ర కానాల గ్రామం చేరుకుంది. పంచాయతీరాజ్ మంత్రిగా నేను పల్లె ప్రగతికి చేసిన కృషికి ఆనవాళ్లు ఈ శిలాఫలకాలు జగన్ మోహన్ రెడ్డి, అభివృద్ధి అంటే వంగలేక ఎవరో రాయి తెస్తే దానిపై టెంకాయ కొట్టడం, స్టంప్స్‌పై టెంకాయ కొట్టడం, చంద్రబాబు చేసిన శంకుస్థాపనల్ని ధ్వంసం చేసి పేర్లు మార్చి కొత్త శిలాఫలకాలు వేయడం అభివృద్ధి కాదు జగన్ మోహన్ రెడ్డి ! అని హితవు పలికారు.

రూ.18 కోట్లతో తెలుగుగంగ కాలువ మరమ్మతులు

విశాలాంధ్ర - చాగలమర్రి : తెలుగు గంగ ప్రధాన కాలువ, పంట కాలువల మరమ్మతులకు రూ.18 కోట్లు నిధులు మంజూర య్యాయని ఈఈ శివశంకర్ రెడ్డి తెలియజేశారు. చాగలమర్రి మండలంలోని చింతలచెరువు పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైన పంట కాలువ మరమ్మతుల పనులను గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు గంగ ప్రధాన కాలువ, 36వ బ్లాకు నుంచి పంట కాలువల మరమ్మతులకు రూ.18కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రధాన కాలువలో దెబ్బతిన్న చోట్ల లైనింగ్ పనులను చేపడుతున్నామన్నారు. పంట కాలువల్లో పూడికతీత, దెబ్బతిన్న స్ట్రక్చర్ల మరమ్మతులు చేపడుతున్నామన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందివ్వడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ గోవిందరాజులు, ఏఈలు నియాజ్ అహ్మద్, సలీం పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 19, మే 2023

విద్యార్థులకు రక్షణలేని ఎడిఫై స్కూలు తొలగించాలి

విశాలాంధ్ర - కర్నూలు : ప్రమాదకరమైన గ్యాస్ గోడౌన్ దగ్గర ఏర్పాటు చేసిన ఎడిఫై స్కూల్‌ను తొలగించాలని పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కర్నూల్ సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బి.మహేంద్ర బాబు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న మాట్లాడుతూ కర్నూల్ పట్టణంలో ప్రమాదకరమైన వాతావరణంలో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్న ఎడిఫై స్కూల్ యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణమే సిజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ సిలబస్ ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన తర్వాత సిబిఎస్ సి పర్మిషన్ ఇస్తారని కానీ ప్రభుత్వ జీవోలను తుంగలో తొక్కి సెంట్రల్ సిలబస్ పేరుతో నర్సరి నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. జీవో నెంబర్ 1,99 ప్రకారం ఎటువంటి ఆర్భటపు ప్రచారాలు చేయకుండా అడ్మిషన్లు చేసుకోవాలి కానీ ఎడిఫై స్కూలు కర్నూల్ నగరంలో పెద్దపెద్ద ఫ్లెక్సీలతో రంగురంగుల కరపత్రాలతో ఎన్నికల తలపించే విధంగా బూటకపు మాటలు చెబుతూ అక్రమ అడ్మిషన్ చేసుకుంటున్నారని అన్నారు. ఎడిఫై స్కూల్లో తక్షణమే సిజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో పెద్ద ఎత్తున దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మునిస్వామి నగర కోశాధికారి అశోక్, బాషా,దినేష్,అఖిల్, సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలని ఐజేయూ సభ్యులు కే.నాగరాజు,కొండప్ప,ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ సలహాదారులు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఎస్.రాజు, కె.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి అంజి, ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శి అవినాష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పౌర సంబంధాల, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) జయమ్మను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా కేంద్రంగా రెగ్యులర్ పేపర్స్ తో పాటు చానల్స్, చిన్న పేపర్స్, పీడీఎఫ్ పేపర్స్ వెలువడుతున్నాయన్నారు. అయితే 3లక్షల పైగా సర్క్యులేషన్(సీఏ) ఉంటేనే మండలానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాలని జీఓ ఇవ్వడం బాధాకరం అన్నారు. దీనివల్ల రెగ్యులర్ పేపర్స్‌లో పని చేసే మండల రిపోర్టర్స్ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కనుక ఈ నిబంధన ను తొలగించి గతంలో మాదిరి 75వేల నుంచి 3 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న రెగ్యులర్ పేపర్స్ కు మండలానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాలని కోరారు. అలాగే ఎలక్ట్రానిక్ మీడియా కు పాత జిల్లా కేంద్రం తో పాటు కొత్త జిల్లా కేంద్రంలో కూడా నాలుగు అక్రిడేషన్లు ఇవ్వాలన్నారు. ఎంప్యానల్ ఉండి రెగ్యులర్ గా వస్తున్న చిన్న పేపర్స్‌కు నియోజకవర్గానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాల న్నారు. పీడీఎఫ్ పేపర్స్ కు అటెండెన్స్ తో సంబంధం లేకుండా గతంలో మాదిరి 3 నెలల పేపర్స్ ప్రింటింగ్ తెచ్చి ఇచ్చిన వారికి జిల్లాకు రెండు అక్రిడేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రిపోర్టర్స్ అందరికీ న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్ర మాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఏపీయూ డబ్ల్యూ జే నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, శీను, శశి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

విశాలాంధ్ర - వెల్దుర్తి : మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలోని ఒకటవ సచివాలయాన్ని గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను తనిఖీలు చేసి సచివాల సిబ్బందితో మాట్లాడుతూ సేవలు తప్పనిసరిగా చేయాలని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విధులకు చెప్పిన టయానికి రావాలని అన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

విశాలాంధ్ర - కర్నూల్ సిటీ : సేవా కార్యక్రమాలు చేయడంలో టీజీవి సంస్థలు ఎప్పుడు ముందుంటాయని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, టీజీవి సంస్థల చైర్మన్ టిజి భరత్ అన్నారు. టీజీవి సంస్థల నుండి అందజేసిన రూ. 5 లక్షల విరాళంతో ఎండోమెంట్ గోశాలలో వేయించిన గ్రానైట్ బండ పరుపును గురువారం ధన్వంతరి హెూమం నిర్వహించి టిజి భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పదిమందికి ఉపయోగపడే ఏ కార్యక్రమం అయినా చేసేందుకు టీజీవి కుటుంబం ఎప్పుడూ ముందు ఉంటుంద న్నారు. గాయత్రి గో సేవా సమితి సమన్వ యం వల్లే ఇది సాధ్యపడిం దన్నారు. ఒక చిన్న గోశాలగా ప్రారంభమైన గాయత్రి గోశాల నేడు దాదాపు వెయ్యి గోవులకు చేరువలో అక్కడ ఉండే విధంగా బ్రహ్మాండంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను భరత్ అభినందించారు. గాయత్రి గోశాల దక్షిణ భారతదేశంలోనే ఒక గొప్ప గోశాలగా తయారవుతుందన్నారు. పది మందికి మంచి చేయడమే మా కుటుంబ ఉద్దేశమని ఇది అందరూ గుర్తుంచుకోవాలన్నారు. గాయత్రి గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ గోసేవ కోసం టిజి భరత్ ఎంతో సహాయం చేస్తున్నారని అన్నారు. ప్రతి నెలా రూ. 15లక్షల దాకా ఖర్చవుతుంటే సగానికి పైగా టిజి భరత్ తరుపున అందుతుందని తెలిపారు. గోమాత ఆశీస్సులు వారిపై ఉండాలని కోరుకుంటున్నట్లు గోశాల నిర్వాహకులు అన్నారు. అహోపా నాగేశ్వరరావు, గాయత్రి గోశాల అధ్యక్షుడు జగదీష్ గుప్త, గౌరవ అధ్యక్షుడు విజయ్ కుమార్, ట్రెజరర్ ఇల్లూరు రాజ్యలక్ష్మి, మాజీ పాలక మండలి సభ్యులు శ్రీకాంత్, అహోపా సభ్యులు, గాయత్రి గోసేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల విక్రయాలు నిలుపుదల

విశాలాంధ్ర - దేవనకొండ : మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో రూ.5.65 లక్షలు విలువచేసే విత్తనాల విక్రయాలను నిలుపుదల చేసినట్లు ఆలూరు,పత్తికొండ ఎడిఏలు సునీత, మోహన్‌విజయ్‌కుమార్,ఎఓ సురేష్ బాబులు తెలిపారు.గురువారం మండల కేంద్రంలో ఎరువుల,విత్తనాల దుకాణాలను తనిఖి చేశారు. తనిఖీలలో మన గ్రోమోర్‌సెంటర్ ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేయగా అనుమతుల వివరాలు లేని రూ.5.65 లక్షలు విలువ చేసే ప్రత్తి విత్తనాలకు విక్రయాల అనుమతులను నిలిపివేసిన్నట్లు వారు తెలిపారు.దుకాణాలలో రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని,డీలర్స్ టు డీలర్సు విత్తనాలు అమ్మకూడదని,అనుమతులు పొందిన కంపెనీలకు చెందిన వాటినే విక్రయించాలని, రైతులు లూజు విత్తనాలు కొనుగోలు చేయకూడదన్నారు. విత్తనాలు కోనుగొలు చేసిన యడలా రసీదు, ప్యాకెట్ పంట చివరి వరకు దగ్గరే ఉంచుకోవాలని రైతులకు సుచించారు.లూజు విత్తనాలు అమ్మిన ఎడల క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. తనికిలలో ఏఈఓలు జయరాం, యోగి, రంగన్న, లు ఉన్నారు.

రైల్వే స్టేషన్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ఎన్నో ఏళ్లుగా చరిత్ర కలిగిన ఆదోని రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నీలకంటప్ప,కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిలీప్ దోక రైల్వే అధికారులను కోరారు. ఈ సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పడిన విలేకరులతో వారు మాట్లాడుతూ రోజుకు లక్షన్నర పైగానే ఆదాయం ఉన్నప్పటికీ సౌకర్యాలు కల్పించ డంలో రైల్వే అధికారులు విఫలం చదువుతున్నారని వ్యాఖ్యానించారు. ప్లాట్ఫారంలో సౌచాలయాలు లేక ప్రయాణికులు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నీటి సౌకర్యం లేదని నాలుగవ ప్లాట్ఫారం నన్ను షెల్టర్ కూడా అంతంత మాత్రమే ఉందని ఆరోపించారు. ఆదోని మీదుగా రోజుకి 40 రైళ్లపై గానే ప్రయాణిస్తుండడంతో నాలుగో ప్లాట్ఫారం నందు ప్రయాణికుల కొరకు వేచి ఉండే గదులు లేకపోవడం మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. గతంలో ఎప్పుడో లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి మరిచారని విమర్శించారు. ఈ మధ్యకాలంలో ఆదోని శాసనసభ్యులు రైల్వే బోర్డ్ మెంబర్ కావడం జరిగిందని, రైల్వేలో ప్రయాణించే ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తగు సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. గుంతకల్ రైల్వే డివిజన్ మేనేజర్ ఆదోని రైల్వే స్టేషన్ పై ప్రత్యేక దృష్టి ఉంచి నాణ్యతతో కూడిన రైల్వే పనులు తక్షణమే చేపట్టాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, నాయకులు దేవిశెట్టి వీరేష్ ఉన్నారు.

మానవ జీవన శైలిలో చిరుధాన్యాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మానవుల జీవన శైలిలో చిరుధాన్యాలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని డ్వాక్రా బజార్ మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ఏర్పాటు చేసిన మిల్లెట్ ఎగ్జిబిషన్ ప్రోగ్రాం లో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ ఎస్.మౌర్య, మున్సిపల్ కమీషనర్ భార్గవ్ తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరు ధాన్యాల వాడకం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈరోజు చిరుధాన్యాల వంటకాలను ప్రోత్సహిస్తూ వాటి నుండి ఎటువంటి ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు అనే అంశాన్ని స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మన అందరి జీవన విధానాలు మారాయి గతంలో మన పెద్దవాళ్లు చేస్తున్నటువంటి శారీరక శ్రమ ఈ కాలం వారు చేయడం లేదని అందుకే చిన్న వయస్సులోనే డయాబెటిస్, బివి వంటి రోగాలు వస్తున్నాయన్నారు. మన జీవనశైలితో పాటు ఆహార శైలిలో కూడా మార్పు తీసుకొని రావడానికి చిరుధాన్యాలు మన జీవన శైలిలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అందుకొరకు అన్నంతో పాటు చిరుధాన్యాలు కూడా తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే విషయాన్ని అందరం తెలుసుకోవాల న్నారు. కర్నూలు ప్రాంతానికే పరిమితం కాకుండా చిరుధాన్యాల ఉత్పత్తులను, చిరుధాన్యాలు పండించే రైతులను మరింత ప్రోత్సహించి ఏరియా విస్తీర్ణంతో పాటు మార్కెటింగ్ లో కూడా డెవలప్ చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలకు చిరుధాన్యాలు వాడమని చెబుతున్నాం కాబట్టి ముందు మనం మొదలుపెట్టి వారికి చెప్పాలని అందులో భాగంగానే కలెక్టరేట్ ఆవరణంలో మిల్లెట్ కేఫ్ ఏర్పాటు చేస్తున్నామని అందులో మిల్లెట్ బ్రేక్ ఫాస్ట్, మిల్లెట్ లంచ్, స్నాక్స్ ఏర్పాటు చేసి ప్రజలకు త్వరలో అందుబాటులో తీసుకొని వస్తామని అన్నారు. దీని ద్వారా ఎస్‌హెచ్‌జి గ్రూపులకు ఎంప్లాయి మెంట్ క్రియేట్ చేయడమే కాకుండా మార్కెటింగ్ లో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిఆర్డిఏ పిడి, మెప్మా పిడిని కలెక్టర్ ఆదేశించారు. అంతే కాకుండా మిల్లెట్స్‌ను ప్లాస్టిక్ బాక్స్‌లో కాకుండా ప్రత్యామ్నాయ ప్యాకేజ్ చేయించాలన్నారు.. ఎందుకంటే ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డిఆర్డిఏ పిడి, మెప్మా పిడి అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి మిల్లెటట్ల ఏరియా విస్తీర్ణం పెంచడంతో పాటు వాటి యొక్క మార్కెటింగ్ ను కూడా పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎస్‌హెచ్‌జి ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ స్టాల్స్ ను కలెక్టర్,జాయింట్ కలెక్టర్,మున్సిపల్ కమీషనర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మళ్ళీ మొదలైన బి.అగ్రహారం స్మశాన సమస్య

విశాలాంధ్ర - గోనెగండ్ల : మండల పరిధిలోని బి అగ్రహారం గ్రామం లో గత రెండు నెలలుగా కొనసాగుతున్న స్మశాన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపని కారణంగా మళ్ళీ మొదలైయ్యిందని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యండి ఆనంద్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం అగ్రహారం గ్రామంలో ఉదయం నుండి స్మశాన సమస్య పరిష్కారం కోసం ఎదురు చూసిన గ్రామ ప్రజలు, ఎంతకీ అధికారులు స్పందించక పోవడంతో.. కోపోద్రి క్తులైన మహిళలు గ్రామ సచివాలయం వద్దకే అదెమ్మ శవాన్ని తీసుకవచ్చి, సచివాలయం ముందే పూడ్చేందుకు గుంతను తవ్వారు. గుంతను తవ్వుతున్నా సచివాలయంలోకి వెళ్లి బయటకు రాని తహసీల్దార్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినదిం చారు. అరగంట ఆందోళన అనంతరం బయటకు వచ్చిన తహసీల్దార్ మాట్లాడుతూ, ఎవరైతే కోర్టుకు వెళ్లి మీకు కేటాయిం చిన స్థలం పై స్టే తెచ్చుకున్నారో, అతను ఫెక్ పట్టాలు పెట్టారు. అతడు గ్రామంలో భూస్వామి, ఇక్కడే కాదు ములుగుందంలో కూడా అతనికి భూమి ఉంది అని తేల్చాము. స్టే వెకెట్ కు కోర్టుకు వెలుతాము. కోర్టులో ఉన్నకారణంగా వెళ్లలేము. స్టేలో లేని భూమి చూపిస్తాం అని హామీ ఇచ్చారు.హామీతో సర్వే నెం 244/1 వద్దకు వచ్చిన ప్రజానీకాన్ని కొలతలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారు, తిరిగి ఆందోళనతో ఆకుపై చేసుకున్న చేను చివరిలోనే గుంతతీయించి పూడ్పించారు.కార్యక్రమం లో మండల తహసీల్దార్ వేణుగోపాల్, ఎమ్మిగనూరు సీఐ మధుసూదన్, రూరల్ యస్ ఐ, నిరంజన్ రెడ్డి, పెద్దకడూవురు యస్ ఐ, శ్రీనివాస్ లు కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు బి కరుణాకర్, బియస్పి నాయకులు లక్ష్మి నారాయణ, ఎర్రన్న, రైతుసంఘం నాయకులు నరసింహులు, కెవిపియస్ గ్రామ నాయకులు గిరిరాజు, రంగస్వామి, బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

విశాలంధ్ర - కర్నూల్ సిటీ : స్థానిక సి.క్యాంపు లోని ప్రత్యేక దత్తత కేంద్రం జిల్లా బాలల సంరక్షణ, జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి సంస్థ నందు చిన్నారు లకు పాల డబ్బాలు, దుస్తులను ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్న పేగును తెంచుకుంటున్న వైనం మాతృత్వాన్ని ప్రశ్నించేలా ఉందని, ముక్కుపచ్చలారని పిల్లలు చెత్త కుప్పలో పడేయడం బాధాకరమన్నారు. ముళ్ల పో దలు, చెత్త కుప్పలు నడిరోడ్డుపై పసి పిల్లలను వదిలేసి పేగు బంధాన్ని తెంచేసుకుంటున్న కసాయి తల్లిదండ్రుల వల్ల అనాథగా మారిన పిల్లలను అక్కున చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనాథ అన్న భావన వారిలో రాకుండా దత్తత కేంద్రం నిర్వాహకులు ఆప్యా యత అనురాగం ప్రేమను పంచుతూ సొంత బిడ్డల్లా చూసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మాతృ ప్రేమను నోచుకోని పసి మొగ్గలు. కన్నతల్లి ముర్రిపాలనోచుకోని ఈ శిశువులను పోషక లోపం అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవాల్సి ఉందన్నారు.

20న ఆందోళనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు : జిల్లాలో పత్తి,మిరప కల్తీ విత్తనాలను అరి కట్టాలని ఈనెల 20వ తేదీన మండల వ్యవసాయ కార్యాలయాల దగ్గర ధర్నాలు నిర్వహించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం ఒక ప్రకటనలో కోరారు. నకిలీ విత్తనాల వల్ల గత ఏడాది పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు.గత ఏడాది చేదు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని జె.డి.ఏ ఈ విషయంలో స్పందించడం లేదని తెలిపారు.రైతులు నకిలీ విత్తనాలు కొని సాగు చేసి లక్షల రూపాయలు నష్టపోతున్నారని సీజన్ కన్నా ముందే ఈ దొంగ వ్యాపారం ప్రారంభమైన అధికారులు మాత్రం స్పందించడం లేదని తెలిపారు. పత్తి ,మిరప పంటలకు ధర ఒక మాదిరిగా ఉన్నందున ఈ రెండు పంటలు ఈ సంవత్సరం అధికంగా వేసే అవకాశం ఉన్నందున మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా వస్తున్నాయన్నారు. రసాయనిక ఎరువులు కూడా కల్తీ వస్తున్నాయి వీటిని అడిగే నాథుడే లేదు కావున నకిలీ విత్తనాలు అమ్మే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. 20వ తేదీన మండల వ్యవసాయ కార్యాలయాల దగ్గర జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలిపారు.

పత్తికొండ : నకిలీ విత్తనాలను అరికట్టాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కారన్న, పెద్ద ఈరన్నలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈఏడాది 15రోజులలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందన్నారు. పత్తికొండ ప్రాంతరైతులుఅధికసంఖ్యలోహాజరైవిజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మిగనూరు టౌన్ : నేడు నకిలీ విత్తనాలు,నాణ్యతలేని విత్తనాలు మార్కెట్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని అలాంటి దుకాణాలపై చర్యలు తీసుకోకుండా తనిఖీల పేరుతో కాలయాపన చేస్తున్నారని నకిలీ విత్తనాలను నాణ్యతలేని విత్తనాలను విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన అన్ని మండలాలలో వ్యవ సాయ శాఖ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంపన్న గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు.రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్తన్న, సీపీఐ జిల్లా నాయకులుభాస్కర్‌యాదవ్,సీపీఐమండలకార్యదర్శిబిటిచిన్నాన్న పాల్గొన్నారు.

డబ్బులు స్వాహా చేసిన బిసి పాయింట్ నిర్వాహకుడు

విశాలాంధ్ర-కోసిగి : స్థానిక ఎస్బిఐ బీసీ పాయింట్ నడుపుతున్న నిర్వాహకుడు పొదుపు మహిళలు డబ్బును స్వాహా చేశాడు. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పొదుపు మహిళలు బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేయడంతో లక్షలాది రూపాయలు నిర్వాహకుడు స్వాహా చేసినట్లు విచారణలో బయటపడింది. ఓకే సారి డబ్బు సంపాదించాలని అనుకున్నాడో ఏమో పాపం ఆ వ్యక్తి పొదుపు మహిళాలనే టార్గెట్ చేశాడు. పొదుపు మహిళలు అప్పు కట్టడానికి వచ్చిన డబ్బులను బ్యాంకు కు కట్టకుండా ఖాతాదారులకు పేపర్ పై సీల్ వేసి, సంతకం చేసి పంపిస్తున్నాడు. పొదుపు మహిళలు, బ్యాంకు ఖాతాదారులు తమ అకౌంట్లును చెక్ చేసుకోవడానికి మేనేజర్‌ను కలిశారు. మినిస్టేట్‌మెంట్ తీసేసరికి బిసి పాయింటు నిర్వాహకుడి బాగోతం బయటపడింది. దీంతో ఖాతాదారులు లబోదిబోమంటు,బిసి పాయింటు నిర్వాహకుడు చేసిన నిర్వాకానికి ఎస్బిఐ బ్యాంకు అధికారులు సైతం తలలు పట్టుకున్నారు. బీసీ పాయింట్ నిర్వాహకుడి దగ్గర పొదుపు మహిళలు నెల నెలా పోదుపు తో పాటు అప్పు చెల్లించడానికి వచ్చిన పోదుపు మహిళలను టార్గెట్ చేసి, తమ అప్పు తో పాటు పోదుపు కట్టడానికి వచ్చిన మహిళలకు పేపర్ పై సంతకం, సీల్ వేసి డబ్బులు కట్టినట్లు రిసిప్ట్ ఇచ్చి పోదుపు మహిళలను మోసం చేస్తున్నాడు. శివ పొదుపు గ్రూపుకు సంబంధించిన మహిళలు పదివేలు రూపాయలు తమ పొదుపు అప్పుకు జమ చేయమని ఇస్తే, జమ చేయకుండా పేపర్ పై సీల్ వేసి సంతకం చేసి బిసి పాయింటు నిర్వాహకుడు డబ్బులు దండుకుంటుంన్నారని శివ పోదుపు గ్రూపు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా వెంకటేశ్వర పొదుపు గ్రూపు మహిళలు ఇరవై రెండు వెల రూపాయలు తమ పొదుపు ఖాతాకు జమ చేయమని ఇస్తే రెండువేలు మాత్రంమే జమ చేసి మోసం చేశాడు.మరో పోదుపు గ్రూపు మహిళలు ఇరవై ఏడు వేల ఐదు వందల రూపాయలు జమ చేయమని వెళితే ఏడు వేల ఐదు వందలు మాత్రమే ఖాతాకు జమ చేసి ఇరవై వేల రూపా యలు ఖాతా కు జమ చేయకుండా మోసం చేశాడని పొదుపు సంఘం మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా చూసుకుంటూ పోతే భారీ మొత్తంలో మోసం చేసినట్లు తెలిసింది. ఎస్బిఐ మేనేజర్ గమనించి బిసి పాయింటు నిర్వాహకుడి ఐ.డీ ని ని లాక్ చేశారు.ఈ విషయం ఆ నోట ఈ నోట తెలియడంతో కోసిగి ఊరు వాకిలి దగ్గర ఉన్న బిసి పాయింటులో కట్టిన ఖాతా దారులు తమ అకౌం టుకు సంబంధించి మిని స్టేట్ మెంట్ కోసం స్థానిక బ్యాంకు కు క్యూ కట్టి నట్లు తెలిసింది. దాదాపు లక్షలాది రూపాయలు ఖాతా దారుల అకౌంట్ లోకి వేయ కుండా బిసి పాయింటు నిర్వాహకుడు నీలి.నరసింహులు మోసం చేశాడనీ వెంటనే ఆ బిసి పాయింట్ నిర్వాహకుడు పై చర్యలు తీసుకోవాలని, సొమ్ము రికవరీ చేసి ఖాతాదారులకు ఇవ్వాలని ఖాతాదారులతోపాటు పొదుపు మహిళలు డిమాండ్ చేశారు.

నూతన డీఎస్పీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : కర్నూలు జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో భాగంగా ఆదోని రోడ్డులోని నూతనంగా ఏర్పాటు చేసిన డియస్పీ కార్యాలయాన్ని జిల్లా యస్పీ కృష్ణకాంత్ చేతులు మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగరెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, బిఆర్ బసిరెడ్డిలు పాల్గొన్నారు. ఈమెరకు రిబ్బన్ కట్ చేసి డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాల విభజన అనంతరం ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో డిఎస్పి కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నూతన కార్యాలయ ఆవరణ ంలో ఎస్పీ చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి ప్రసాద్, సిఐలు మధుసూదన్ రావు, ఎస్సైలు మస్తాన్ వలి, శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, టౌన్ బ్యాంకు చైర్మన్ కొమ్మురాజు, పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేస్తే ఖబర్దార్

విశాలాంధ్ర - ఆదోని : ప్రచార బ్యానర్లు ఏర్పాటు చేసి విద్యార్థులను మోసం చేస్తే ఖబర్దార్ అంటూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సాబీర్ బాషా హెచ్చరించారు. గురువారం పట్టణంలో అనేక చోట్ల ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించి అనంతరం భీమస్ సర్కిల్ నందు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాబీర్ భాష మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు, బాలాజీ జూనియర్ కళాశాల, జ్యోతిర్మయ జూనియర్ కళాశాల , నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం తదితర ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా హక్కు చట్టంలో పొందపరచిన విద్యని వ్యాపారం చేయకూడదని నిబంధనలను తుంగలో తొక్కి రోడ్లమీద బ్యానర్లు కట్టి ప్రజలను, ఉద్యోగస్తులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏడాది పాటు బ్యానర్లలో అడ్మిషన్లు జరుగుతున్నాయి అంటూ ప్రచారం నిర్వహించడం విడ్డూరమని, వీటిపై విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థి సంఘాలుగా దేనికైనా సిద్ధమేనని, ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు ఇలా రోడ్లమీద ఎక్కడబడితే అక్కడ విద్యాసంస్థలు కట్టిన బ్యానర్లను తొలగించి వాటిని కట్టిన విద్యాసంస్థల మీద తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో ఉన్నటువంటి స్కూళ్లల్లో కూడా ఒక్కొక్క విద్యార్థికి లక్ష రూపాయల చొప్పున వసూలు చేస్తూ సిబిఎస్ సిలబసుల పేరు చెబుతూ డమ్మీ పత్రాలతోటి నడుపుతున్న అడ్మిషన్లు పెట్టుకున్నా స్కూల్ లను సీజ్ చేయాలని, సిబిఎస్ పర్మిషన్ కావాలి అంటే కనీసం ఐదు సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలో ఉండాలని అన్నారు. అడ్మిషన్లు పెట్టుకున్న ఏ ఒక్క స్కూలు కూడా ఆ నిబంధన పాటించలేదని,లక్షల రూపాయలు డబ్బును వసూలు చేస్తున్నటువంటి వ్యాపార విద్యాసంస్థలను సీజ్ చేసి విద్యను వ్యాపారం చేస్తున్నటువంటి వారిని అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్,పీడీఎస్‌యు విద్యార్థి సంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకుడు అఖండ, ఏఐఎస్ఎఫ్ పట్టణ ఉపాధ్యక్షుడు వీరేష్,నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి, శివ కుమార్, పిడిఎస్‌యు, నాయకులు, అభిమిత్ర, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - కోసిగి : మండలంలో ఉన్న ప్రతి మహిళ అన్ని రంగాల్లో రాణించాలని కేచారి ట్రస్ట్ సెక్రెటరీ శ్రీ హర్ష అన్నారు. గురువారం స్థానిక కేచారిలక్ష్మీ నరసింహ స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు రామ్మూర్తి జోషి ఆదేశాల మేరకు సమర్థ ప్రోగ్రాం ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలకు, కేంద్ర ప్రభుత్వం వారు జారీ చేసినటువంటి బ్యాగ్ మరియు ట్రైనింగ్ కిట్టు అందజేశారు. సమర్థ, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్ టైల్స్ ద్వారా 60 రోజులపాటు ఉచిత శిక్షణ అందించి, ప్రభుత్వం వారి నిర్వహించు పరీక్షలో ఉత్తీర్ణ పొందిన వారికి ఉత్తీర్ణ పత్రములు అందజేశారు. 14 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళ సొంతంగా కుట్టు మిషన్ నేర్చుకుని తమ కాళ్ళపై నిలబడి అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలన్నాదే ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - మద్దికేర : మండల కేంద్రమైన మద్దికెర 2వ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలు గృహాలు వద్దకు గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు. ఎమ్మెల్యే గడపగడపకు తిరుగుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరి గడుపు దగ్గరికి సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేద ప్రజలకు కోసం అనేక సంక్షేమ పథకాలు సీఎం జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టి అమ్ములు పరుస్తున్నారని తెలిపారు. జడ్పిటిసి మురళీధర్ రెడ్డి సర్పంచ్ బండారు సుహాసిని మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వర రెడ్డి.మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్. మాజీ ఎంపిటిసి డిఎస్ యాదవ్ రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ ఆర్ వెంకటేశ్వర్లు మండల అధికారులు వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.